TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక :14 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శుక్రవారం.08.08.2025 పేజీలు : 4, వెల:రూ.1.00

## ఢిల్లీలో సీఎంతో జర్నలిస్టుల భేటీ



న్యూఢిల్లీ: అమృత్ తెలంగాణ: తెలంగాణలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్) కోరింది. ఈ మేరకు ఢిల్లీలో గురువారం డీజేహెచ్ఎస్ అధ్యక్షులు బొల్లోజు రవి, డైరెక్టర్ ప్రతాపరెడ్డి, సభ్యులు నవీన్ దుమ్మాజీ, సతీష్ యాదవ్ తదితరులు ఆయన నివాసంలో కలిశారు. ఫ్యూచర్ సిటీలో ఇండ్ల స్థలాలు ఇస్తామని గతంలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఎలాగైనా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని బొల్లోజు రవి, ప్రతాప్ రెడ్డి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జర్నలిస్టులకు గుడ్‌న్యూస్ చెప్పిన విషయాన్ని వారు సీఎంకు వివరించారు. కాగా ఇండ్ల స్థలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఉన్న విషయాన్ని సీఎం ప్రస్తావించారు.

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తమ మ్యానిఫెస్టోలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఆనాడు పార్టీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డిని డీజేహెచ్ఎస్ బృందం కలిసి విన్నవించిన సంగతి తెలిసిందే. దీంతో ఆ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరిచారు. సీఎం అయ్యాక ఫ్యూచర్ సిటీలో జాగాలు ఇస్తామని బహిరంగంగా ప్రకటించారు.

జర్నలిస్టుల ఆశలపై

జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి పెట్ బషీరాబాద్‌లో కేటాయించిన 38 ఎకరాల భూమి విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పరిస్థితిని అంతా తలకిందులైందని ఆ సొసైటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీర్పు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపును అడ్డుకుంటూ, వారి దశాబ్దాల కలను అగమ్యగోచరంగా మార్చిందని అభిప్రాయాన్ని వ్యక్తపర్చారు. 'బడుగు వర్గాలకు ప్రభుత్వం ఇండ్లు, స్థలాలు, సంక్షేమ పథకాలు అందిస్తుంది. జర్నలిస్టులు ఎక్కువమంది అదే వర్గాల నుంచి వచ్చినప్పుడు వారికి ఈ హక్కు ఉంటుంద'ని డీజేహెచ్ఎస్ అభిప్రాయపడుతోంది.

ఫ్యూచర్ సిటీపై ఆశలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని ప్రకటించారు. 'జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ఫైల్‌పై ఒక నిమిషంలో సంతకం చేస్తాను' అని ఆయన హామీ ఇచ్చినప్పటికీ, సుప్రీంకోర్టు తీర్పు ఈ ప్రక్రియకు అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో హామీ అమలు కోసం ప్రయత్నించాలని సీఎంను కోరుతోంది. 'సీఎం సానుకూలంగా ఆలోచిస్తే సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించేందుకు చర్యలు తీసుకోవచ్చు' అని జర్నలిస్టు నాయకులు సూచిస్తున్నారు.

## బీసీలకు కాంగ్రెస్ మోసం



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: బీసీల రిజర్వేషన్ల చట్ట బద్ధత విషయంలో కాంగ్రెస్ పార్టీ వారిని మోసం చేసిం దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శిం చారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడేమో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక చూద్దామంటుందని ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డికి కేసీఆర్ ఫోబియా పట్టుకుందనీ, ముఖ్యమంత్రి చేస్తున్నది ముమ్మాటికీ డ్రామానే అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పరిగి నియోజక వర్గానికి చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారిని కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే అనే షరతు ఉందా? అని ప్రశ్నించారు.

ఢిల్లీకి వెళ్లినా రేవంత్ రెడ్డి కేసీఆర్ గురించే మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పేరు తీయకుండా ఉండలేని మానసిక రుగ్మత రేవంత్ రెడ్డికి ఉన్నదేమో అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్, బీసీ డిక్లరేషన్‌లోని ఇతర హామీలను పూర్తిగా పక్కన పెట్టిందని ఆరోపించారు. పీఎం మోడీతో, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతోనూ రేవంత్ రెడ్డి చేస్తున్నది డ్రామానేనని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌లో చివరకు వరకు ఉంటానని చెప్పడం కూడా డ్రామానేనని మండిపడ్డారు.


దౌర్భాగ్య స్థితిలో పార్టీ మారిన నేతలు

పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "కండువాలు కప్పుకుని ఇప్పుడు దేవుడి కండువాలు కప్పుకున్నామనీ, ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేకపోతున్నారని తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో రాష్ట్రంలో చిన్న పిల్లవాడిని అడిగినా చెప్తారనీ, కానీ శాసనసభ స్పీకర్‌కు మాత్రం ఇంకా తెలియడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాలు తగ్గాలంటే, అధికారులు ప్రజల మాట వినాలంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు అయిపోగానే కాంగ్రెస్ సర్కారు రైతుబంధును రద్దు చేస్తుందని కేటీఆర్ జోస్యం చెప్పారు.

కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటాం

తాము పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించామనికేటీఆర్ తెలిపారు. ఆ సమయంలో పార్టీ కార్యకర్తలకు తగినంత చేయలేకపోయామని ఆయన అంగీకరించారు. మళ్లీ అధికారంలోకి రాగానే కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు గట్టిగా కష్టపడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఉన్నంత కాలం గులాబీ కండువా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలను మట్టి కరిపించి కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## జస్టిస్ వర్మ ఉద్వాసనకుతొలగిన అడ్డంకులు



న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ: తనపై సుప్రీంకోర్టు నియమించిన న్యాయమూర్తులు జరిపిన విచారణను సవాలు చేస్తూ జస్టిస్ యశ్వంత్ వర్మ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం గురువారం తోసిపుచ్చింది. దీంతో పార్లమెంటులో ఆయన అభిశంసనకు అడ్డంకులు తొలగిపోయాయి. ఈ ఏడాది ప్రారంభంలో జస్టిస్ వర్మ నివాసంలో పెద్ద మొత్తంలో నగదు లభించిన సంగతి తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణ జరిపిన న్యాయమూర్తుల బృందం ఆయనను తొలగించాలని సిఫారసు చేసింది. జస్టిస్ వర్మను పదవి నుంచి తొలగించాలంటూ అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఖన్నా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సిఫారసు చేశారు. తనపై వచ్చిన ఆరోపణల విచారణకు న్యాయమూర్తులను నియమించడాన్ని జస్టిస్ వర్మ సవాలు చేశారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దీపాంకర్ దత్తా, ఏజీ మస్షితో కూడిన బెంచ్ వర్మ పిటిషన్‌ను తోసిపుచ్చుతూ న్యాయమూర్తులతో కమిటీని ఏర్పాటు చేయడం, కమిటీ పాటించిన పద్ధతులు చట్టబద్ధంగానే ఉన్నాయని స్పష్టం చేసింది. తనపై కమిటీ దర్యాప్తు జరపడం చట్టవిరుద్ధమన్న వర్మ వాదనను తోసి పుచ్చింది. 'ఫొటోలు, వీడియోను అప్‌లోడ్ చేయడం మినహా ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తుల కమిటీ నిబంధనలు పాటించాయి. ఫొటోలు, వీడియోను అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని మేం చెప్పాం. మీరు అప్పుడు దాన్ని సవాలు చేయలేదు' అని బెంచ్ తెలిపింది. ప్రధానికి, రాష్ట్రపతికి సీజేఐ లేఖలు పంపడం రాజ్యాంగ విరుద్ధం కాదని అభిప్రాయ పడింది. కమిటీ ఏర్పాటును జస్టిస్ వర్మ ఎందుకు వ్యతిరేకించలేదని గత విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు బెంచ్ ప్రశ్నించింది. కమిటీ ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధమని భావించి ఉంటే దాన్ని వ్యతిరేకించాలి కదా అని అడిగింది. కమిటీ తన నివేదికను రాష్ట్రపతికి పంపేముందు అభిప్రాయాన్ని తెలియజేసే అవకాశం తనకు ఇవ్వలేదన్న జస్టిస్ వర్మ వాదనతో బెంచ్ విభేదిస్తూ ఆ అవసరం లేదని తెలిపింది. పిటిషనర్ ప్రాథమిక హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లలేదని న్యాయస్థానం అభిప్రాయపడింది. 'సుప్రీంకోర్టు న్యాయ మూర్తులు జరిపే విచారణకు చట్టబద్ధత ఉంటుంది. అది రాజ్యాంగ చట్రానికి వెలుపల ఉన్న సమాంతర యంత్రాంగం కాదు' అని చెప్పింది.

న్యాయమూర్తిని తొలగించాలని సిఫారసు చేసే అధికారం సుప్రీం కమిటీకి లేదని జస్టిస్ వర్మ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ అన్నారు. అది కేవలం ప్రధాన న్యాయమూర్తికి సలహా ఇవ్వడానికి మాత్రమే పరిమితమని చెప్పారు. ఇలాంటి చర్య రాజ్యాంగేతర యంత్రాంగానికి అవకాశం కల్పిస్తుందని వాదించారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం



హైదరాబాద్ అమృత్ తెలంగాణ: నగరంలో భారీ కుండపోత వర్షం కురిసింది. గురువారం సాయంత్రం నుంచి మొదలై రాత్రి వరకు కురుస్తూనే ఉంది. నగర వ్యాప్తంగా భారీ వర్షపాతం నమోదైంది. పలు ప్రధాన రహదారులపై వరద నీరు చేరడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు వరదలో మునిగిపోయాయి. యూసుఫ్‌గూడలో వరదనీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో జూబ్లీహిల్స్ టు యూసుఫ్‌గూడ రోడ్డు పూర్తిగా బ్లాక్ అయింది. చాలా వరకు వాహనాలు, బైకులు వరద నీటిలో మునిగిపోయి దెబ్బతిన్నాయి. వాహనవారులు ఈ మార్గం నుంచి వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్యస్థానాలకు వెళ్లాలని పోలీసులు, అధికారులు సూచించారు. అమీర్‌పేట మెట్రోస్టేషన్ కింద మోకాళ్ల లోతు వరద నీరు చేరుకుంది. ఖైరతాబాద్ నుంచి జూబ్లీహిల్స్, కొండాపూర్, మియాపూర్- లింగంపల్లి మార్గాల్లో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఇప్పటికే ఎమర్జెనీ బృందాలు అప్రమత్తమయ్యాయి. ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా, జీహెచ్ఎంసీ బృందాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో నిమగమయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు ఎక్కడికక్కడా వాహనాలను క్లియర్ చేసే పనిలో ఉన్నారు. పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనుల్లో ఆ శాఖ అధికారులు నిమగమయ్యారు.

కూకట్‌పల్లి, మూసాపేట, అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్, మధురానగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, ఖైరతాబాద్, కోఠి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. సైబర్ సిటీ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. గచ్చిబౌలిలోని ఖాజాగూడ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద అత్యధికంగా 123.5మి.మీ. వర్షపాతం నమోదైనట్టు తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ తెలిపింది. శ్రీనగర్ కాలనీలో 111.3 మి.మీ., ఖైరతాబాద్‌లో 108.5 మి.మీ. యూసఫ్‌గూడలో 104.0 మి.మీ. వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.

నిండుకుండలా హిమాయత్‌సాగర్

నగరంలో భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. పలు చోట్ల వర్షపు నీరు ఇండ్లల్లోకి చేరింది. హిమాయత్‌సాగర్‌కు వరద ప్రవాహం పెరిగింది. ఏ క్షణంలోనైనా గేట్లు తెరిచి దిగువన మూసీలోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మూసీ పరివాహక ప్రాంత ప్రజలను జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు.

## రాజగోపాల్ రెడ్డిపై ఏఐసీసీ గరంగరం



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై కాంగ్రెస్ అధిష్టానం గరంగరంగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఏఐసీసీ నిర్ణయించింది. అధిష్టానం ఆదేశాలతో టీపీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మెన్ మల్లు రవి రంగంలోకి దిగారు. రాజగోపాల్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడిన ఆయన ఎమ్మెల్యేకు క్లాస్ పీకినట్టు తెలిసింది. రెండు మూడు రోజుల్లో ఆయన్ను గాంధీభవన్‌కు పిలిచి మాట్లాడాలని క్రమశిక్షణ సంఘం నిర్ణయించింది. రాజగోపాల్ గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలు చేసినప్పటికీ పార్టీ పెద్దగా పట్టించుకోలేదు. అయినా ఆయన తన వైఖరిని ఏ మాత్రం మార్చుకోకుండా సొంతపార్టీ నేతలపైనా, సీఎంపైనా బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అధిష్టానం పట్ల కూడా ఆయన ఇదే రకంగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

ఈ క్రమంలో తాజాగా ఆయన సీఎంపై చేసిన వ్యాఖ్యలను హైకమాండ్ సీరియస్‌గా తీసుకుంది. 'నాకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వడం లేదు. నాకంటే జూనియర్లకు క్యాబినెట్‌లో స్థానం కల్పించారు' అంటూ కోమటిరెడ్డి ఇటీవల వ్యాఖ్యానించిన సంగతి విదితమే. దాంతోపాటు సీఎంగా రేవంత్‌రెడ్డి మూడున్నరేండ్లు మాత్రమే ఆ పదవిలో ఉంటారనీ, ఆ తర్వాత ముఖ్యమంత్రి ఎవరనేది అధిష్టానం చూసుకుంటుందంటూ కామెంట్లు చేశారు. మంత్రి ఉత్తమ్ టీపీసీసీ అధ్యక్షులుగా ఉన్నప్పుడు రాజగోపాల్ ఆయన పట్ల కూడా ఇదే రకంగా వ్యవహరించారు. దీంతో ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో విభేదాలొచ్చాయి. ఈ పరిణామాలతో కాంగ్రెస్‌లో కొనసాగలేక రాజగోపాల్ పార్టీకి, తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. తర్వాత కమలం కండువా కప్పుకుని మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసి ఘోరంగా ఓడిపోయారు. ఓటమి తర్వాత కొంతకాలం రాజకీయంగా సైలెంట్‌గా ఉన్న ఆయన బీజేపీలో ఆశించిన స్థాయిలో అవకాశాలు లేవని భావించి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో మునుగోడు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ సందర్భంగా భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తేమంత్రి పదవి ఇస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు రాజగోపాల్‌రెడ్డి ప్రచారం చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచినప్పటికీ మంత్రివర్గ విస్తరణలో ఆయనకు చోటు దక్కలేదు. దీంతో రాజగోపాల్ తరచూ మీడియా ముందుకొచ్చి సొంత పార్టీపైనా, ప్రభుత్వంపైనా విమర్శలు గుప్పిస్తున్నారు. అందులో భాగంగానే ఆయన సీఎంపై నేరుగా విమర్శల దాడికి దిగుతున్నారు. సీఎం, మంత్రులతోపాటు కాంగ్రెస్‌లోని మరికొందరు నేతలపై కూడా కోమటిరెడ్డి గతంలో ఇదే రకంగా వ్యాఖ్యలు చేసి, వారి ఆగ్రహానికి గురయ్యారు. తద్వారా ఏదో ఒకరకంగా మీడియాలో నానుతూ వస్తున్నారు. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేసి మరోసారి వార్తల్లో నిలిచారు. దీంతో పార్టీ నేతలు ఆయనపై తీవ్ర స్థాయిలో ఆగ్రహాన్ని, అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. బీసీ బిల్లుపై కాంగ్రెస్ ఢిల్లీలో పోరాటం కొనసాగిస్తోన్న సంగతి తెలిసిందే. ఇదే సమయంలో కాళేశ్వరం అవినీతిపై పీసీ ఘోష్ కమిటీ తన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. దానిపై రాష్ట్ర మంత్రివర్గంలో కూడా చర్చించారు. ఇలాంటి పరిణామా లను తనకు అనుకూలంగా మార్చుకోవాలని అధికార పార్టీ భావిస్తోన్న తరుణంలో అందుకు భిన్నంగా రాజగోపాల్‌రెడ్డి పార్టీకి నష్టం చేకూరేలా మాట్లాడుతున్నారంటూ పలువురు ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి కూడా ఇది ఇబ్బందికరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలను ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ట్వీట్టర్ వేదికగా తప్పుపట్టారు. రాజగోపాల్‌కు మంత్రి పదవి ఇచ్చే విషయంపై అధిష్టానానిదే తుది నిర్ణయమని చెప్పారు. మొత్తం మీద ఈ ఎపిసోడ్ హాట్ హాట్‌గా కొనసాగుతోంది. టీపీసీసీ క్రమశిక్షణ సంఘం ఈ వ్యవహారంపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

## హైకోర్టు ప్రాంగణంలో న్యాయవాది గుండెపోటుతో మృతి




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: హైకోర్టు ప్రాంగణంలో గురువారం మధ్యాహ్నం విషాద ఘటన చోటుచేసుకుంది. సీనియర్ న్యాయవాది పర్సా అనంత నాగేశ్వర్‌రావు (47) కోర్టు కారిడార్‌లో గుండెపోటుతో మృతి చెందారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కూర్చుని ఉన్న ఆయన, పక్కనే ఉన్న ఫైల్స్‌పై తలవాల్చిన అనంతరం కుర్చీలోనే కూలిపోయారు. అది గమనించిన వారు వెంటనే అంబులెన్స్‌ను రప్పించి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధృవీకరించారు. ఆయన లా పూర్తి చేసి ప్రాక్టీస్ ప్రారంభించారు. సీనియర్ న్యాయవాది వై. రామరావు వద్ద జూనియర్‌గా పనిచేశారు. అనంతరం అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, ప్రభుత్వ న్యాయవాది, స్పెషల్ జీపీగా సేవలందించారు. మృతదేహాన్ని షేక్‌పేట్‌లోని నివాసానికి తరలించగా, హైకోర్టు న్యాయమూర్తి పుల్లా కార్తీక్, న్యాయవాదులు, అడ్వొకేట్ క్లర్కులు నివాళులు అర్పించారు. అలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కె పార్థసారథి, నాయకులు జి విద్యాసాగర్, హైదరాబాద్‌జిలా అధ్యక్షులు డి ప్రవీణ్, కార్యదర్శి సి రామచంద్రారెడ్డి సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

రేవంత్‌రెడ్డికి హైకోర్టు హాజరు నుంచి మినహాయింపు

ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో 2016 జూన్‌లో నమోదైన క్రిమినల్ కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు మంజూరు చేసింది. ఈ కేసును విచారిస్తున్న కింది కోర్టు హాజరు అవసరమని ఆదేశిస్తే, హాజరుకావాలని స్పష్టం చేసింది. కేసును సవాల్ చేస్తూ రేవంత్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ కె. లక్ష్మణ్ గురువారం విచారించారు. ప్రతివాదులైన పోలీసులకు నోటీసులు జారీ చేసిన కోర్టు, కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన తెలంగాణ జనజాతర బహిరంగ సభలో నాటి ఎంపీగా పాల్గొన్న రేవంత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కౌంటర్ దాఖలు చేస్తామని తెలియజేయడంతో, విచారణ సెప్టెంబర్ 1కి వాయిదా పడింది.

### మెయిన్ రోడ్డు మరమ్మత్తు జరిగి ఏడాది కాలం కూడా గడవక ముందే మళ్లీ చెడిపోయి గుంతలు ఏర్పడి అధ్వాన్నంగా తయారైంది,




మల్లాపూర్ అమృత్ తెలంగాణ ఆగస్టు 7 , మండలం లోని మొగిలిపేట గ్రామం పాత బస్టాండ్ నుండి కొత్త బస్టాండ్ చెందిన మెయిన్ రోడ్డు మరమ్మత్తు జరిగి ఏడాది కాలం కూడా గడవక ముందే మళ్ళీ చెడిపోయి గుంతలు ఏర్పడి అధ్వాన్నంగా తయారైంది,ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.దానికి తోడు పాత బస్టాండ్ నుండి కొత్త బస్టాండ్ వరకు రోడ్డుకు ఏ ఒక్క పక్క కూడా మురికి కాల్వలు నిర్మింప బడలేదు . వర్షపు నీరు మొత్తం రోడ్లపై నిలిచి అక్కడ నివసించే ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు . సంక్షేమ పథకాలు అందడంతో పాటు రవాణా సౌకర్యాలు కూడా బాగుపడితే ఇంకా బాగుంటుందని ప్రజలు వాపోతున్నారు . సంబంధిత అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు

## నకిలీ బిల్లుల వ్యవహారంలో ఏఈ సస్పెండ్. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి ముధోల్ మండలంలోని ఎడ్ బిడ్ పీఆర్ పనుల్లో నకిలీ బిల్లుల వ్యవహారం వెలుగులోకి రావడంతో అక్కడి అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) సురేందర్‌ను సస్పెండ్ చేసినట్టు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ వ్యవహారం తమ దృష్టికి వచ్చాక తదుపరి విచారణకు ఆదేశించినట్లు కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నకిలీ బిల్లుల వ్యవహారం నిజమేనని తేలినందున ఆయన్ను సస్పెండ్ చేయడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు చట్టవిరుద్ధంగా వ్యవహరించకూడదని, భవిష్యత్‌లో ఇటువంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఉద్యోగులందరూ క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను కలిసిన బైంసా సబ్ కలెక్టర్.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిది గురువారం బైంసా సబ్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన అజ్మీరా సంకేత్ కుమార్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో పుష్పగుచ్ఛన్ని అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు ఇరువురు జిల్లా స్థితిగతులపై చర్చించారు.

## అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్..




జన్నారం :అమృత్ తెలంగాణ: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని కలమడుగు జడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి అన్నారు. గురువారం మండలంలోని కలమడుగు ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్ తో పాటు వృక్ష రక్షాబంధన్ నిర్వహించారు.. కుటుంబ బంధాలను పెంపొందించడానికి సోదర భావాన్ని పెంపొందించడానికి రక్షాబంధన్ ఏర్పాటు చేసి విద్యార్థులతో విద్యార్థులకు, చెట్లకు రాఖీలు కట్టించడం జరిగిందన్నారు. కుటుంబ బంగాలను రక్త సంబంధాలను పెంపొందించుకోవడానికి రక్షాబంధన్ చక్కని కార్యక్రమమని విద్యార్థులకు సూచించారు. వృక్ష రక్షాబంధన్ నిర్వహించి ప్రతి ఒక్కరూ చెట్లను రక్షించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఆడే గజేందర్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ఢిల్లీలో తుగ్లక్ రోడ్ లోని ముఖ్యమంత్రి అధికార నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బోత్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ నాయకత్వంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ముఖ్యమంత్రి కలిసిన ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య . ఎమ్మెల్సీ దండే విట్టల్ ఆసిబాబాద్ జిల్లా అధ్యక్షులు విశ్వ ప్రసాద్ మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి. బోత్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ తదితరులు

## భారత దేశ ప్రధానమంత్రిని కలిసిన ఎంపీ నగేష్ అదిలాబాద్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రధాని నరేంద్ర మోడీ కలసిన ఎం.పీ జి నగేష్ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నరేంద్ర మోడీ ప్రధానమంత్రి తెలంగాణలోని నేత కార్మికులు నేసిన వస్త్రాలు ధోవతి, రుమాలు ప్రధాన మంత్రి ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధాని నీయోజకవర్గంలోని పలు అభివృద్ధి పనుల గురించి ప్రస్తావించారు ప్రధాని సావధానంగా విన్నారు.

## జిల్లా విద్యాశాఖ అధికారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలి.

### ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గోవింద్ నాయక్ బాణావత్ డిమాండ్..



అమృత్ తెలంగాణ ఖానాపూర్ న్యూస్ : ఉపాధ్యాయుల పదోన్నతులు మరియు ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేష్ నాయక్ డీఈఓ కార్యాలయంలో రిప్రజెంటేషన్ వారి యొక్క ప్రాతినిధ్యం చేయడానికి వెళ్లిన క్రమంలో విద్యాశాఖఅధికారిరామారావు ఉమామహేశ్వర్ రెడ్డిమరియు కార్యాలయంలో ఎలాంటి ఉత్తర్వులు లేకుండా పనిచేస్తున్న పనిచేస్తున్న వారిని అడగడంతో అతనిపై భౌతిక దాడికి ప్రయత్నించి కులం పేరుతో తిట్టడాన్ని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం తీవ్రంగాఖండిస్తున్నది భవిష్యత్తులో ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఎస్సీ ఎస్టీ చట్టం ప్రకారంచర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేయడమైనది

## పొదుపును అలవాటు చేసుకోవాలి..




జన్నారం :అమృత్ తెలంగాణ: పొదుపును అలవాటుగా మార్చుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ కృష్ణ, జన్నారం బ్రాంచ్ మేనేజర్ సచిన్ సూచించారు.

## ఇల్లు ఉన్న వాళ్ళకే ఇందిరమ్మ ఇల్లా..?

### ఇల్లు లేని,కిరాయి ఉన్నవాళ్లకు ఇవ్వాలంటూ..పిర్యాదు.






ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ ఆగస్టు 7 జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోదురు గ్రామంలో ఇల్లు ఉన్న వాళ్లకే ఇల్లు ఇచ్చారంటూ గోదురు గ్రామ వాసి గోపు లలిత అను వ్యక్తి మండల డెవలప్మెంట్ ఆఫీసర్ కు పిర్యాదు చేశారు, వివరాల్లోకి వెళితే గోదురు గ్రామంలో రాచకొండ సునీత అను వ్యక్తికి ఇంటి నెంబర్ 6-18 నెంబరు గల ఇల్లు ఇప్పటికే ఉందని వారు అందులోనే నివాసం ఉంటున్నారనీ అని మండల డెవలప్మెంట్ ఆఫీసర్ కు ఫిర్యాదు చేసింది ప్రభుత్వం కేటాయించిన కోరుట్ల ఎమ్మెల్యే కోటలోని ఇందిరమ్మ ఇండ్లను ఒక బిఆర్ఎస్ నాయకుడు వారికి దగ్గరి బంధువు అని ఇల్లు ఉన్న వారికి ఇచ్చుకున్నారు అని సదరు పిర్యాదు దారు వాపోతున్నారు గోదురు గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలు, కిరాయికి నివాసం ఉంటున్నవారు చాలామంది ఉన్నారని ఇప్పటికే ఇల్లు ఉన్న రాచకొండ సునీతకు కేటాయించిన ఇల్లును రద్దు చేసి ఇల్లు లేని వారికి ఇల్లు ఇవ్వాల్సిందిగా ఆమె అధికారులను కోరడమైనది.

## హైదరాబాద్ టీ-హబ్, టీ-వర్క్స సందర్శనకు కోరుట్ల, మెట్‌పల్లి విద్యార్థులు

### స్వంత ఖర్చులతో తీసుకెళ్ల నున్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్




కోరుట్ల అమృత్ తెలంగాణ ఆగస్టు 7 కోరుట్ల, మెట్‌పల్లి పట్టణ డిగ్రీ కాలేజీల విద్యార్థులను స్వంత డబ్బుతో హైదరాబాద్ టీ-హబ్,టీ-వర్క్స సందర్శనకు ఈనెల 14న తీసుకెళ్లనున్న కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్,ఈరోజు కోరుట్లలో పలు డిగ్రీ కాలేజీలను సందర్శించి విద్యార్థులకు టీ-హబ్,టీ-వర్క్స గురించి వివరించరు. స్టార్టప్ రంగంలో ప్రపంచంలోనే తెలంగాణకు ఓ సుస్థిర స్థానాన్ని సాధించిన టీ-హబ్ ని సందర్శించడం ద్వారా మీకు కొత్త ఆలోచన విధానాలు వొస్తాయ్ అని పేర్కొన్నారు, గతంలో కూడా మన నియోజకవర్గ విద్యార్థులు టీ-హబ్,వీ-హబ్ ని సందర్శించిన అనంతరం ఇది ఒక కొత్త ప్రపంచమని చాల అనుభవాలు ఈ సందర్శన అనంతరం వొచ్చాయి అని తెలిపారు. విడతల వారీగా అందరు విద్యార్థులను టీ-హబ్,వీ-హబ్ సందర్శనకు తీసుకెళ్తానని ప్రతి ఒక్కరు ఉన్నత స్థానంలో ఉండటమే నా ధ్యేయం అని విద్యార్థులకు వివరించారు. రాష్ట్రంలో కేటీఆర్ ఐటీ మంత్రిగా ఉన్నపుడు ఎన్నో అవకాశాలు వచ్చాయని, కష్టపడితే ఉద్యోగ, స్వంత వ్యాపార రంగంలో తేలికగా రాణించొచ్చని అన్నారు. విద్యార్థులకు అన్ని వేళల్లో అండగా ఉంటానని, ఏ అవసరమొచ్చిన నన్ను సంప్రదించొచ్చని భరోసానిచ్చారు.

## ప్లాట్ యజమానులపై దౌర్జన్యం కేసులో ఒకరి అరెస్టు.

**ఆదిలాబాద్ పట్టణంలోని స్థలాల కబ్జాల కేసులలో నిందితుని పాత్ర.**
**నకిలీ దస్త్రవీజులు సృష్టించి, భూములను ఆక్రమించి, అమాయకులను మోసం చేస్తున్న నిందితుడి అరెస్ట్**
**ఇదివరకే ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఒక్కొక్క కేసు నమోదు.**
**ఆదిలాబాద్ గ్రామీణ సీఐ శ్రీ కె. ఫణీందర్**

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్

నిందితుని వివరాలు

సయ్యద్ అహ్మద్ (42) S/o సయ్యద్ సిరాజ్ అహ్మద్, రా/3-1/1, మంగుర్లా, సత్నాల మండలం, ప్రస్తుత నివాసం: మి.సంఖ్య 2-191, ఎస్.ఎస్. గార్డెన్, బృందావన్ కాలనీ, ఆదిలాబాద్

2025 ఆగస్టు 6వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో, శాంతినగర్, ఆదిలాబాద్ కు చెందిన బాధితుడు ఆదిగోపుల శ్రీనివాస్(48) S/o పోచలు, ఆదిలాబాద్ గ్రామీణ పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేయగా,

ఫిర్యాదిలో తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారు 2012లో శ్రీరామ్ కాలనీకి చెందిన దీకొండ ప్రభాకర్ %ూ/శీ% లక్ష్మణ్ నుంచి ప్లాట్ నెం. 73 (సర్వే నెం. 68/బి/44/1)ను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ తన పేరుపై చేయించుకున్నాడు. అప్పటి నుంచి తానే ఆ స్థలాన్ని స్వాధీనంగా ఉపయోగించుకుంటూ, ఫెన్సింగ్ మరియు గోడలు నిర్మించాడు.

2023 జనవరి 21వ తేదీ సుమారు మధ్యాహ్నం 4 గంటల సమయంలో, ఫిర్యాదుదారు ఇతర పొరుగు ప్లాట్ యజమానులు %-% రాథోడ్ భీమ్ రావు, కర్మంకర్ హేమంత్ కుమార్, పోలకొండ సంతోష్, పెర్ల గంగయ్య లతో కలిసి అక్కడ ఉండగా, సయ్యద్ హైమద్ మరియు మరికొందరు కూలీ కార్మికులు కలిసి ఆ ప్లాట్లలోకి బలవంతంగా ప్రవేశించి, లోహపు రాడ్లతో మరియు ఇతర పరికరాలతో ఫెన్సింగ్, గోడలు ధ్వంసం చేసినట్లు తెలిపారు. వారు తమకు న్యాయపత్రాలున్నాయని చెప్పినప్పటికీ, వారు నకిలీ పత్రాలను చూపించి, అసలు పత్రాలను బలవంతంగా లాక్కొని, చంపుతామన్న భయానక బెదిరింపులకు దిగారని ఫిర్యాదుదారు తెలిపారు. సదరు బెదిరింపుల వల్లనే అప్పట్లో పోలీస్ స్టేషన్ కు రావలసినప్పటికీ భయంతో ఫిర్యాదు చేయలేకపోయినట్టు తెలిపారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీస్ అధికారులు సంబంధిత వ్యక్తులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు. తదుపరి విచారణ కొనసాగుతుందని తెలిపారు.

ఇతనిని ఈరోజు అరెస్టు చేసి గౌరవ న్యాయస్థానానికి తరలించడం జరిగిందని తెలిపారు.




ఇతనిపై ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో మరియు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఇలాంటి నకిలీ పత్రాలను సృష్టించిన కేసులు నమోదు అయినట్టు తెలిపారు. ప్రజలను మోసగిస్తూ నకిలీ పత్రాలను సృష్టిస్తూ బలవంతంగా వారి స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై జిల్లా పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. బాధితులు ఎవ్వరైనా నిర్భయంగా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని, పోలీసు యంత్రాంగం సరైన రక్షణ చర్యలు చేపడుతూ వారికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## కలెక్టర్ ఆదేశాలతో ఆగిన సీసీరోడ్డు పనులు



ముధోల్ :అమృత్ తెలంగాణ: ముధోల్ మండలంలోని ఎడ్ బిడ్ గ్రామంలో జరుగుతున్న సీసీరోడ్డు పనులను తక్షణమే ఆపాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఎంపీడీఓ శివ కుమార్ ను ఆదేశించారు. ఎడ్ బిడ్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 7లక్షలు సిసి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే సిసి రోడ్డు నిర్మించుకుండా బిల్లును పంచాయతీ రాజ్ అధికారులు ఆన్లైన్ లో పొందుపరిచారు. ఈ విషయం గురువారం మీడియా ద్వారా బయటకు పొక్కింది. దీంతో సీసీరోడ్డు పనులను గుత్తేదారు గురువారం ప్రారంభించారు.

# అధికారులు స్పందించండి మా భూమి మాకు అప్పగించండి..

సూర్యాపేట : అమృత్ తెలంగాణ: కాయ కష్టం చేసి కొనుగోలు చేసిన భూమిపైకి తమను రానివ్వకుండా మా గ్రామానికి చెందిన కొందరు పెద్ద మనుషులు అడ్డుకుంటూ మమ్మల్ని చంపుతామని బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఈ విషయమై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీలకు విన్నవించినా ఎలాంటి స్పందన లేకపోవడంతో వారు మమ్మల్ని చంపుతామని బెదిరిస్తున్నారని కలెక్టర్ స్పందించి మాకు న్యాయం చేయాలని రైతు కుటుంబం కంటతడి పెట్టుకున్న సంఘటన సూర్యాపేట కలెక్టరేట్ లో గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతు గడ్డం సత్యనారాయణరెడ్డి, భార్య సులోచన, కుమారుడు హరీష్ రెడ్డిలు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలంలోని కోటపహాడ్ గ్రామంలో 209, 210 సర్వే నెంబర్ లలో పదేళ్ళ క్రితం 8.30 ఎకరాల భూమిని కొనుగోలు చేసి తలా మూడెకరాల చొప్పున పట్టా చేయించుకున్నారు.



గత ఎనిమిదేళ్ళుగా కబ్జాలో ఉండి సాగు చేస్తున్నపటికి గత రెండు సంవత్సరాలుగా గ్రామానికి చెందిన కొందరు పెద్ద మనుషులు ఎలాంటి ఆధారాలు లేకుండా భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మా భూమిలో నుంచి 30గుంటల వరకు దున్నారని అడ్డు వెళ్ళిన తమపై దాడి చేయగా పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశామన్నారు. ప్రస్తుతం మా భూమికి వెళ్ళేందుకు దారి లేదంటూ తమను భూమిపైకి వెళ్ళకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రె డ్డితో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు విన్నవించినప్పటికి ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రస్తుతం వారు మమ్మల్ని భూమిపైకి వెళ్ళనీయకుండా చంపుతామంటూ బెదిరిస్తున్నారన్నారు. గత రెండేళ్ళుగా మా పొలం మొత్తం భీడుగా మారిందని మా పరిస్థితి దయానీయంగా ఉందని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి మా భూమి మాకు అప్పగించి సదరు పెద్దలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# పల్లె పహాడ్ లో ఈత చెట్ల ప్లాంటేషన్



తుర్కపల్లి : అమృత్ తెలంగాణ: తుర్కపల్లి మండలం పల్లెపహాడ్ గ్రామంలో గురువారం ఈత చెట్ల ప్లాంటేషన్ కార్యక్రమాన్ని జిల్లా ఎక్సైజ్ అధికారి విష్ణుమూర్తి, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి లు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో గ్రామానికి 500 మొక్కల చొప్పున 15 వేల మొక్కలను నాటించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ దీపిక, ఎంపీఓ వెంకటేశ్వర్లు, సబ్ ఇన్స్పెక్టర్ విజయసారథి ,ఎస్సీ సెల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, ఏపీఓ ఎర్ర నారాయణ ,ఈసీ సింగమల్లె యశోద, పంచాయతీ కార్యదర్శి మనీ ప్రసాద్, పిఏ జ్యోతి, వెంకటేష్, హిమాం, మహేష్, కానిస్టేబుల్స్ అల్వాల సత్యనారాయణ, బాలరాజు, నరసింహులు, వెంకటేష్, బాలకృష్ణ, లక్ష్మయ్య, కృష్ణ, రాజయ్య, సద్గురు, బాలయ్య పోచమ్మ ,మల్లేష్, నారాయణ, రాములు, మంజుల, కమలమ్మ, పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల పంపిణీలో రగడ

ఆసిఫాబాద్ :అమృత్ తెలంగాణ: కుమురం భీం – ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓ లోకేశ్వర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డుల పంపిణీని ప్రభుత్వం చేపట్టిందని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రకారం రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేసినట్టు వివరించారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్ కల్పించుకొని ఇది ప్రభుత్వ కార్యక్రమమని, ప్రతిపక్ష కార్యక్రమం కాదని, ఎమ్మెల్యేగా మాట్లాడే విధానం తెలుసుకోవాలని సూచించారు. అధికారులను బెదిరించడం సరైంది కాదనడంతో ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే తన చేతిలోని వాటర్ బాటిల్‌ను ఆయనపైకి విసిరారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అదనపు కలెక్టర్ వారిని వారించే ప్రయత్నం చేశారు. పోలీసులు ఇరు గ్రూపులను అక్కడి నుంచి పంపించేశారు. ఎక్కడి నుండో వచ్చిన స్థానికేతరులు నియోజకవర్గంలో అధికారం చెలాయిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి హెచ్చరించారు. 10 సంవత్సరాలు బీఆర్‌ఎస్‌లో అనేక రకాల పదవులు అనుభవించి



ఇప్పుడు తమ పార్టీని విమర్శించడం దారుణమన్నారు. మహిళా ఎమ్మెల్యేను అవమానించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఘటన మొత్తాన్ని కాంగ్రెస్ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు తమ పార్టీ నాయకునికి కూడా చెబుతామని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయాలు మాట్లాడటం సరైంది కాదన్నందుకు తనపై ఎమ్మెల్యే దాడి చేయడం హేయమైన చర్య అని శ్యామ్‌నాయక్ అన్నారు. బీఆర్‌ఎస్ పది సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయని విమర్శించారు. ఎమ్మెల్యే తన స్థాయిని మరిచి బాటిల్ విసరడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా విధానం మార్చుకోవాలని హితవు పలికారు.

# పనులు చేయకుండా బిల్లులు తీసుకునే వారిపై చర్యలు తీసుకోవాలి..

ముధోల్ :అమృత్ తెలంగాణ: సీసీరోడ్డు పనులు చేయకుండా బిల్లులు తీసుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముధోల్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకురాలు పి. రమాదేవి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకులు కొందరు ప్రొసీడింగ్ లు తీసుకొని, పనులు చేయకుండా సంబంధిత అధికారుల సహాయంతో బిల్లులు ఆన్లైన్ చేసుకున్నారని ఆరోపించారు. ముధోల్ మండలం లోని ఎడ్ బిడ్ గ్రామంలో అధికార పార్టీ నాయకులు సి సి రోడ్డు పనులు చేయకుండా బిల్లులు మంజూరు చెహించుకోవడం అవినీతికి పాల్పడడమే అని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయం పై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పనులు




చేయకుండా బిల్లులు మంజూరు చేయించుకున్న నాయకులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక ముధోల్ మండలమే కాకుండా పలు గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు, కొందరు ఇటువంటి వాటికి పాల్పడుతున్నారని అన్నారు. ఉపాధి హామీ సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణంల పై పూర్తి విచారణ జరపాలని కోరారు.


# డ్రాగన్ బ్యూటీ క్రేజ్ తగ్గట్టుగానే..!



ఇప్పటికే తెలుగు, తమిళ్ లో వరుస ఆఫర్లు అందుకుంటుంది కయదు. అనుదీప్ కెవి, విశ్వక్ సేన్ కాంబినేషన్ లో వస్తున్న సినిమాలో అమ్మడు లక్కీ ఛాన్స్ అందుకుంది. ఎన్ని సినిమాలు చేశామన్నది కాదు ఎప్పుడు పాపులర్ అయ్యామన్నది ముఖ్యం అన్నట్టుగా ఇండస్ట్రీకి వచ్చి ఎన్నాళ్లయ్యింది అన్నది కాదు. ఎప్పుడు క్రేజ్ తెచ్చుకున్నాం అన్నది హీరోయిన్స్ కి లెక్క ఉంటుంది. అలా చేస్తున్న సినిమాలతో సినిమా సినిమాకు తమ రేంజ్ పెంచుకునే వారిలో చాలామంది భామలు ఉండగా వారిలో కొత్తగా డ్రాగన్ బ్యూటీ కయదు లోహర్ చేరింది. ప్రదీప్ రంగనాథన్ తో డ్రాగన్ సినిమాలో అమ్మడు నటించగా ఆ సినిమాతో సూపర్ పాపులారిటీ తెచ్చుకుంది. ఐతే ఈ సినిమాలో ఆమె పర్ఫార్మెన్స్ కి అదిరిపోయే మార్కులు పడ్డాయి. డ్రాగన్ ముందు వరకు కయదు రేంజ్ వేరు. ఆ సినిమా రిలీజ్ అయ్యాక కయదు లెవెల్ మారిపోయింది. డ్రాగన్ హిట్ తో యూత్ లో కయదుకి సూపర్ ఫాలోయింగ్ ఏర్పడింది. ఐతే డ్రాగన్ బ్యూటీ తన పాపులారిటీకి తగినట్టుగానే ప్లానింగ్ చేస్తుంది. ఇప్పటికే తెలుగు, తమిళ్ లో వరుస ఆఫర్లు అందుకుంటుంది కయదు. అనుదీప్ కెవి, విశ్వక్ సేన్ కాంబినేషన్ లో వస్తున్న సినిమాలో అమ్మడు లక్కీ ఛాన్స్ అందుకుంది. జాతిరత్నాలు సినిమా డైరెక్టర్, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరో కాబట్టి ఈ సినిమా తప్పనిసరిగా కయదుకి మంచి హిట్ ఇస్తుందని నమ్ముతున్నారు. ఇదిలాఉంటే అమ్మడు సోషల్ మీడియా లో కూడా సందడి చేస్తుంది. ఆడియన్స్ లో తనకు వచ్చిన ఈ ఐడెంటిటీని మరింత పెంచుకునేలా చేస్తుంది కయదు లోహార్. అమ్మడు ఇలా ఫోటో షేర్ చేస్తే చాలు అలా వైరల్ అయిపోతున్నాయి. ముఖ్యంగా తెలుగు ఆడియన్స్ అయితే కయదు అంటే చాలా క్రేజీగా ఉన్నారు. ఆల్రెడీ కయదు టాలెంట్ చూసే శ్రీవిష్ణు అల్లూరి సినిమాకు ఆమెకు తీసుకున్నాడు. కానీ ఆ సినిమా వర్క్ అవుట్ కాకపోవడంతో ఆమెను ఎవరు పట్టించుకోలేదు. డ్రాగన్ సినిమా సక్సెస్ తర్వాత శ్రీవిష్ణు అల్లూరి సినిమా వీడియోస్ ట్రెండ్ అయ్యాయంటే కయదుకి తెలుగులో ఉన్న ఫాలోయింగ్ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ఐతే పాపులారిటీ అందరికీ వస్తుంది కానీ దాన్ని సక్సెస్ ఫుల్ కెరీర్ గా మలచుకోవడంలోనే కథానాయికల క్లవర్ నెస్ ఆధారపడి ఉ ంటుంది. అందుకే కయదు కూడా మంచి ప్లానింగ్ తోనే సినిమాలు చేస్తున్నట్టు తెలుస్తుంది. మరి తెలుగులో అమ్మడికి వచ్చిన ఈ క్రేజ్ తో స్టార్ హీరోయిన్ రేంజ్ కి వెళ్లేలా తన సినిమాల సెలక్షన్ ఉంటుందా లేదా అన్నది చూడాలి.

# రంభ ఊర్వశి మేనక చేతులెత్తేస్తారు!

నోరా సోషల్ మీడియాల్లో బోల్డ్ ఫోటోషూట్లతోను పాపులరైంది. ఈ బ్యూటీ తాజా ఫోటోషూట్ నెవ్వర్ బిఫోర్ అంటూ కితాబిచ్చేస్తోంది యూత్. స్వర్గంలోరంభ– ఊర్వశి– మేనక లను కొట్టే అందగత్తెలున్నారా? ఇంద్రుని కుమార్తెల అందచందాల సమ్మోహనానికి గురి కాని మగాడున్నాడా? .. కానీ ఇప్పుడు ఆ అభిప్రాయం మార్చుకుంటారు. ఇదిగో ఇక్కడ ఆ ముగ్గురిని తలదన్నే అప్సరస ప్రత్యక్షమైంది. ఒకే ఒక్క లుక్కు చాలు.. అల్ట్రా బ్యూటీ ముందు పోటీపడలేక రంభ ఊర్వశి మేనక చేతులెత్తేస్తారు. పోటీ నుంచి నిరభ్యంతరంగా తప్పుకుంటారు. భారతీయ సినీపరిశ్రమలో దశాబ్ద కాలంగా హవా సాగిస్తున్న మొరాకో బ్యూటీ నోరా ఫతేహి దేవతా సుందరి రూపంతో కుర్రకారు గుండెల్లో నిదురిస్తోంది. మతి చెడే అందంతో కవ్వించడంలోనే కాదు.. అద్భుతమైన డ్యాన్సింగ్ ప్రతిభతో హృదయాలను



గెలుచుకుంది. నోరా సోషల్ మీడియాల్లో బోల్డ్ ఫోటోషూట్లతోను పాపులరైంది. ఈ బ్యూటీ తాజా ఫోటోషూట్ నెవ్వర్ బిఫోర్ అంటూ కితాబిచ్చేస్తోంది యూత్. ప్రఖ్యాత బ్రైడ్స్ టుడే కవర్ పేజీ కోసం నోరా ఫోజులు గుబులు రేకెత్తిస్తున్నాయి. ఈ భామ వైట్ అండ్ బ్లాక్ డిజైనర్ డ్రెస్ లో ఎంతో అందంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఆ నుదుటిన పాపిడిబొట్టు.. నల్లని కాటుక కళ్లు.. మెడలో వెండి హారం.. చూడగానే భారతీయ ట్రెడిషన్ ని ఎలివేట్ చేస్తుంటే, జడలో పది మూరల మల్ల చెండు సువాసనలు కుర్రకారును మత్తులోకి దించుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే...లారెన్స్ మాస్టార్ కాంచన చిత్రంలో నోరా ఫతేహి ఓ కీలక పాత్రలో నటిస్తోంది. ఈ సినిమా తాజా అప్ డేట్ తెలియాల్సి ఉంది. మరోవైపు రియాలిటీ షోల జడ్జిగాను నోరా పాపులరైంది.

# కిల్లింగ్ లుక్స్‌తో మిల్కీ బ్యూటీ

ఈమె చేసిన ఐటెం సాంగ్స్‌కి మంచి స్పందన వచ్చిన నేపథ్యంలో ముందు ముందు మరిన్ని చేసే అవకాశాలు ఉ న్నాయి. మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు కావస్తుంది. 2005లో శ్రీ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించడంతో పాటు ఎన్నో ప్రత్యేక పాటల్లోనూ నటించిన విషయం తెల్సిందే. హీరోయిన్‌గా మిల్కీ బ్యూటీ ఈమధ్య కాస్త స్లో అయినప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఈమె ఇప్పటికీ వరుసగా సినిమాలు చేయడంతో పాటు వెబ్ సిరీస్‌ల్లో నటించడంతో పాటు మ్యూజిక్ వీడియోలను సైతం వదలడం లేదు. ఈమె చేసిన ఐటెం సాంగ్స్‌కి మంచి స్పందన వచ్చిన నేపథ్యంలో ముందు ముందు మరిన్ని చేసే అవకాశాలు ఉన్నాయి. సినిమాలు, వెబ్ సిరీస్‌లు ఇలా అన్ని చోట్ల తన ప్రతిభను చూపిస్తూ తమన్నా ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతూనే ఉంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్‌తో సినిమాల్లో నటించడం ద్వారా ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతూ వస్తుంది. స్కిన్ షో చేసిన పాత్రలతోనే కాకుండా నటనకు ఆస్కారం ఉన్న పాత్రల్లోనూ నటించడం ద్వారా తమన్నాకు మంచి గుర్తింపు దక్కింది. ప్రస్తుతం ఈమె ఓదెల 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. ఆ సినిమాలో లేడీ అఘోరి పాత్రలో నటించడం ద్వారా సర్‌ప్రైజ్ చేయబోతుంది. అఘోరి పాత్రలో నటించేందుకు తమన్నా ఎలా ఒప్పుకుందంటూ కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఇలాంటి ఫోటో షూట్స్‌తో తమన్నా సోషల్ మీడియాలో సందడి చేస్తూనే ఉంటుంది. ఈసారి మిల్కీ బ్యూటీ కవ్వించే చూపులతో చంపేస్తోంది. వయసు పెరిగినా కొద్ది తమన్నా మరింత అందంగా కనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# సారీలో సెగలు పుట్టిస్తోన్న షామా సికిందర్!



బాలీవుడ్ టెంప్టింగ్ సంచలనం షామా సింకిందర్ హాట్ షో గురించి చెప్పాల్సిన పనిలేదు. నిక్కరేసినా..బికిని వేసినా..అందమైన చీర కట్టినా తనదైన మార్క్ ఎలివేషన్ తప్పనిసరి. చేతిలో సినిమాలు లేకపోయినా నెట్టింట క్రేజీ బ్యూటీగా వెలిగిపోతుందంటే? తనలో ఆ గ్లామర్ సీక్రెట్ అన్నదే కారణం. అందాల భామల్లో షామా షో మరింత ప్రత్యేకం. తనలో ఆ క్వాలిటీనే మిగతా భాలల నుంచి వేరు చేస్తుంది. యువత సహా పండు ముసలి వరకూ షామా హాట్ షోకి ఫ్లాట్ అయిపోవాల్సిందే. తాజాగా అమ్మడు మరోసారి సంప్రదాయ చీరకట్టులోనే చుక్కలు చూపిస్తుంది. ఇదిగో ఇక్కడిలా గులాబీ వర్ణం పువ్వుల డిజైన్ చీర మ్యాచింగ్ రవిక ధరించి వావ్ అనిపిస్తుంది. చీరందమంతా షామా అందాల్లోనే దాగి ఉందా? అని ఆశ్చర్యం తప్పదు. సిగ్గులొలకబోస్తూ రెండు కళ్లు మూసుకుని పెదాలపై నవ్వుతో కుర్రాళ్లని అలా తొంగి చూసేలా చేయడం లేదు! ఒక ఫోటోలో అమ్మడి చెవులీలు హైలైట్ అని చెప్పాలి. డిజైన్ దిద్దులు అమ్మడి అందాన్ని మరింత ఫోకస్ చేస్తున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తైతే షామాలో సిసలైన అందాలు మరో ఎత్తుగా నిలుస్తున్నాయి. పైటలా సైడేసి అందాలు విందు చేసేసింది. షోల్డర్ లెస్ బ్లౌజ్ లో షామా ఎద అందాలు ఓ రేంజ్ లో మంటలు పుట్టిస్తున్నాయి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com